క్లుప్తంగా

విద్యార్థికి ఆర్థిక సాయం



వత్సవాయి : ఉన్నత చదువులు చదువుతున్న పేదవిద్యార్థికి ఆర్యవైశ్య సంఘం ఆర్థికసాయం అందించింది. పెనుగంచిప్రోలుకు చెందిన దివ్వెల భరత్ బీటెక్ చివరి ఏడాది చదువుతున్నాడు. ఆర్థికంగా భరత్ కుటుంబం ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు, పొట్టి శ్రీరాములు ట్రస్టు చైర్మన్ బొగ్గవరపు వెంటకరాజారావు రూ.పదివేలు ఆర్థికసాయం అందించారు. భవిష్యత్తులో కూడా చదువుకు అండగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో సంఘ మండల ప్రధానకార్యదర్శి యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐ చవాన్ బాధ్యతల స్వీకారం



కంచికచర్ల : నందిగామ రూరల్ సర్కిల్ సీఐగా డి.చవాన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఏపీ జెన్‌కోలో విజిలెన్స్ విభాగంలో పనిచేసిన చవాన్ సాధారణ బదిలీల్లో బాగంగా సర్కిల్ సీఐగా బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన పి.చంద్రశేఖర్ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు.

100 మందికి వైద్యపరీక్షలు



కొణకంచి(పెనుగంచిప్రోలు): స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి కె.వాణి పాల్గొని 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు మణి, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



జగ్గయ్యపేట: ఇసుక స్టాకు యార్డు నుంచి తెలంగాణాకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి శుక్రవారం తెలిపారు. సీఐ కథనం మేరకు మండలంలోని అనుమంచిపల్లి ఇసుక స్టాకు యార్డు నుంచి రామచంద్రునిపేట మీదుగా అప్పలనర్సాపురంనకు ఇసుక తరలిస్తున్నట్లు ఎస్ఈబీ పోలీసులకు సమాచారం అందడంతో సరిహద్దు వద్ద తెలంగాణ వెళ్తున్న ట్రాక్టర్‌ను గుర్తించారు. ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోవడంతోపాటు డ్రైవర్ అఖిల్‌ను ఎస్ఈబీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నాగసత్యమ్మకు గాజులతో అలంకారం



జగ్గయ్యపేట అర్బన్: శ్రావణమాస మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మైనింగ్ క్వార్టర్స్ వద్ద ఉన్న శ్రీనాగసత్యమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి గాజులతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. అమ్మవారికి పంచామృతాల అభిషేకాలను, ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. వీఎస్‌పీ ఉద్యోగ ప్రముఖులు జీవీఎస్‌డీ ప్రసాద్, లక్ష్మీ దంపతుల సహకారంతో అమ్మవారికి గాజుల అలంకారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా నాగపంచమి వేడుకలు



నందిగామటౌన్: నాగపంచమి వేడుకలను ప్రజలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పుణ్యస్నానాలాచరించి ఆయా ఆలయాలలోని నవనాగులు, జంట నాగులుకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. నందిగామ పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, అనాసాగరంలోని జంట నాగులు, అయ్యప్ప స్వామి వారి ఆలయంలోని నవ నాగులుకు మహిళలు పెద్ద ఎత్తున అభిషేకాలు, పూజలు చేశారు. మండలంలోని మాగల్లులో వేంచేసియున్న మదనగోపాలస్వామి వారి ఆలయంలోని నాగేంద్రునికి అభిషేకాలు, పూజలు చేశారు. ఆయా ఆలయాలలో భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

వర్షం వస్తే రాకపోకలు బంద్

- రోడ్డుకు సమాంతరంగా చప్టాలు..
- శిథిలావస్థలో వంతెనలు
- పొంగుతున్న వాగులు
- భయాందోళనలో వాహనదారులు
- నిలిచిపోతున్న రాకపోకలు



లింగగూడెం వద్ద గండివాగుపై వరద నీటి ప్రవాహం(ఫైల్)

పెనుగంచిప్రోలు: వర్షం వస్తే మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లను వర్షపునీరు ముంచెత్తుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వచ్చే వరద నీటికి మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఆయా రోడ్లలో వాగుల పైన నిర్మించిన చప్టాలు రోడ్డుకు సమానంగా ఉండటంతో వరదనీరు రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వర్షాకాలంలో పలు గ్రామాలకు మధ్య రవాణా నిలిచిపోతోంది.

వరద ఉధృతితో అవస్థలు..

లింగగూడెం వద్ద గండివాగు కొద్దిపాటి వర్షానికే పొంగి రోడ్డుపై పెద్దఎత్తున వరద నీరు ప్రవహిస్తుండగా, పెనుగంచిప్రోలు చెరువు అలుగులు వద్ద కూడా చప్టా రోడ్డుకు మరీ కిందకి ఉంది. ఇక ముండ్లపాడు గ్రామం మధ్యలోని వాగు, అనిగండ్లపాడు వద్ద కూచివాగు కూడా వర్షాకాలం చాలా ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. వాగుపై వంతెన శిథిలావస్థకు చేరగా, రెండు వైపులా రెయిలింగ్ లేకపోవటంతో వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. అలాగే ముచ్చింతాల-తాళ్లూరు మధ్య నడివాగు, అనిగండ్లపాడు-పెనుగంచిప్రోలు మధ్య వాగు, శనగపాడు వద్ద గండివాగుల్లో వర్షాకాలం పెద్దఎత్తున వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు తీవ్ర అవరోధం ఏర్పడుతోంది. రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే కిలోమీటర్ల మేర తిరిగి వెళ్లాల్సి వస్తోంది. వర్షం నీటిలో ఎవరైనా సాహసం చేసి తమ వాహనాలను తీసుకెళ్తున్నా వాహనాలు కాస్తా మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో వర్షాకాలంలో వ్యవసాయ పనులకు వెళ్లాలన్నా, ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా వెళ్లలేక పోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాగుల వద్ద పూడికతీయించడంతోపాటు చప్టాల స్థానంలో కల్వర్టులు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై దీనిపై ఆర్అండ్‌బి అధికారులను వివరణ కోరగా పలు కల్వర్టుల నిర్మాణాలకు సంబంధించి గతంలో అంచనాలు తయారు చేశామని తెలిపారు. అనుమతులు వస్తే పనులు ప్రారంభిస్తామని వివరించారు.



పెనుగంచిప్రోలు చెరువు అలుగుల వద్ద వరదనీటికి ప్రజల ఇబ్బందులు(ఫైల్)



అనిగండ్లపాడు వద్ద దూళ్లవాగు పొంగి రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు(ఫైల్)

రాకపోకలు నిలిచిపోతున్నాయి...



గండివాగుపై చప్టా తక్కువ ఎత్తులో ఉండటంతో వర్షాలకు నీటిప్రవాహం భారీగా ఉంటోంది. దీంతో రాకపోకలు స్తంభించిపోతున్నాయి. వ్యవసాయ సీజన్‌లో రైతులకు చాలా ఇబ్బందిగా ఉంటోంది. వర్షాకాలంలో విద్యార్థులు కూడా పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లలేకపోతున్నారు. – జంగం కాశేశ్వరరావు, పెనుగంచిప్రోలు

ఇబ్బందిగా ఉంది..



ఏకొద్దిపాటి వర్షం వచ్చినా వాగుల్లో నీరు పొంగి రోడ్లపైకి వస్తోంది. అనిగండ్లపాడు వద్దనున్న కూచివాగుపై వంతెన శిథిలావస్థకు చేరడంతోపాటు రెయిలింగ్ కూడా లేదు. ప్రధాన రహదారులపై తరచూ వర్షపు నీరు చేరడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం.

–గింజుపల్లి కోటేశ్వరరావు, అనిగండ్లపాడు

భక్తులతో కళకళలాడిన ఆలయాలు



శ్రీతిరుపతమ్మవారికి పొంగళ్లు తెస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు, యువతులు గృహాల్లో లక్ష్మీదేవికి విశేష పూజలు చేశారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : సకల శుభాలకు నిలయం శ్రావణమాసం. ఈమాసంలో ముఖ్యంగా మహిళలు అమ్మవార్లను విశేషంగా కొలుస్తారు. శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో మహిళలు ప్రత్యేకపూజలు చేశారు. మక్కపేటలోని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ అయ్యప్ప ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. దక్షిణకాళీమాతకు పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం కుంకుమపూజలు చేశారు. ఆలయ నిర్మాణకర్త మల్లెల గాంధీ ఆధ్వర్యంలో అర్చకులు అత్తలూరి యుగంధర్‌శర్మ, సంగయ్య శర్మ పూజలు చేశారు.

మహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు

కంచికచర్ల : శ్రావణమాసం మొదటి శుక్రవారం పురస్కరించుకుని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో భక్తులు శుక్రవారం విశేషంగా పూజలు చేశారు. ఆలయ అర్చకులు కాకాని పవన్‌కుమార్ అమ్మవారికి నీరాజన మంత్ర పుష్పములు, అష్టోతర పూజలు, అబిషేకాలు చేశారు. అమ్మవారికి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన కుంకుమార్చనల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రభ బండి కట్టి పురవీధుల్లో ఊరేగించారు. నెలరోజుల పాటు అమ్మవారికి మహాలక్ష్మీ హోమం, సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.



ప్రత్యేకాలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



దక్షిణకాళీమాత అమ్మవారు

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ శివారులోని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్(వీఎస్‌పీ) జగ్గయ్యపేట లైమ్ స్టోన్ మైన్స్ వద్ద శుక్రవారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

వీఎస్‌పీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని అడ్మిన్ బిల్డింగ్‌లో నిర్వహించిన ఈ వేడుకలకు అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.రామచంద్రనాయక్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మైన్స్ యూనిట్ ఇన్‌చార్జి నాగరాజు మాట్లాడుతూ ఆదివాసులు స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన ఆహారం తీసుకుంటూ ప్రకృతి ఒడిలో జీవిస్తున్నారని తెలిపారు. సమాజానికి ప్రకృతి సంపదను పంచడమే తప్ప తిరిగి ఏమి ఆశించని ఆదివాసీల వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రభుత్వాలు తగిన చొరవ తీసుకుని ఆదివాసీల రక్షణ కోసం ఆయా చట్టాలను కఠినతరం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు పి.సర్వేశ్వరరావు, శ్రవణ్‌కుమార్, కిరణ్‌కుమారసింగ్, కేవీటీ.చంద్రశేఖర్, రామకృష్ణ, శ్రీధర్, ముకుంద విజయకుమార్, మన్నె శ్రీనివాసరావు,జేవీఎస్‌డీ.ప్రసాద్, నవీన్, జీఎస్టీ ప్రసాద్, అబ్దుల గౌస్, రాంప్రసాద్, భాస్కర్, హేమానాయక్ పాల్గొన్నారు.



ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన అవసరం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామసర్పంచ్‌లు, కార్యదర్శులు పంచాయతీ రాజ్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఈవోపీఆర్డీ సాంబశివరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణ, తడిపొడి చెత్తపై మూడురోజులపాటు నిర్వహించనున్న శిక్షణా తరగతులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలపై సర్పంచ్‌లు, కార్యదర్శులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కోరారు. పారిశుద్ధ్య నిర్వహణ, తడిపొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తే, పారిశుద్ధ్యం మెరుగుపడి గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. అనంతరం శ్రీనివాసరావు, సత్యనారాయణ మాట్లాడుతూ తడిపొడి చెత్త, పారిశుద్ధ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌బాబు, ఏవో రాజు, సర్పంచ్‌లు ఆవుల శ్రీనివాసరావు, మీగడ వెంకటేశ్వర్లు, సూర్యప్రకాష్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ సాంబశివరావు

11న టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల టీచర్స్ కోపరేటివ్ సొసైటీ ఎన్నికలు ఆదివారం జరుగనున్నాయి. ఈసందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలోని టీచర్స్ కోపరేటివ్ సొసైటీ బిల్డింగ్ వద్ద శుక్రవారం యూటీఎఫ్ జగ్గయ్యపేట, వత్సవాయి నాయకులు మాట్లాడుతూ తమ ప్యానెల్ అభ్యర్థులను గెలిపించాలని టీచర్లను కోరారు.

నూతన భవనంలోకి అదనపు జిల్లా కోర్టు



నందిగామటౌన్: గాంధీ సెంటరులోని కోర్టు భవనాల సముదాయంలోనికి మార్చిన నందిగామ 16వ అదనపు జిల్లా కోర్టును అదనపు జిల్లా న్యాయమూర్తి శేషయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు అద్దె భవనంలో కొనసాగిన కోర్టును నందిగామ కోర్టు భవన సముదాయంలోకి మార్చడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం న్యాయమూర్తులను న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు లక్ష్మీరాజ్యం, రియాజ్, రేష్మా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విద్యాసాగర్, ఏపీపీ ఈశ్వరప్రగడ రంగారావు, న్యాయవాదులు హనుమంతరావు, కృష్ణంరాజు, దర్శి అర్జున్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం నిర్వహణపై శిక్షణ

పెనుగంచిప్రోలు: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సమర్థవంతంగా ఉండాలని ఎంపీడీవో హర్షసాయి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా సీజనల్ వ్యాధులను అరికట్టడంలో పారిశుద్ధ్య నిర్వహణ ప్రధానమన్నారు. వీధి దీపాలు, డంపింగ్ యార్డుల నిర్వహణ, గ్రామపంచాయతీల అభివృద్ధిపై సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, కార్యాలయ ఏఓ సిద్ధారెడ్డి, ఈవోపీఆర్‌డీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుపై సిబ్బందికి శిక్షణ

జగ్గయ్యపేట అర్బన్: రైతులకు సంక్షేమ పథకాలు అందాలంటూ ఈ-పంట నమోదు ఎంతో ముఖ్యమని జగ్గయ్యపేట సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్.భవాని పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న ఏడీఏ కార్యాలయంలో జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలకు చెందిన వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈవోలకు ఈ-పంట నమోదు కార్యక్రమంపై శుక్రవారం శిక్షణనిచ్చారు. ఈసందర్భంగా ఏడీఏ భవాని మాట్లాడుతూ ఈ-పంట కార్యక్రమంలో అన్ని పంటలను డిజిటల్ సర్వే చేస్తారన్నారు. రైతుసేవాకేంద్రం(ఆర్బీకే) సిబ్బంది బయోమెట్రిక్ విధానంలో ఈకేవైసీ తీసుకోవడం ద్వారా రైతులకు పంటల బీమా, పంట నష్టపరిహారం, ధాన్యం కొనుగోలు, సున్నా వడ్డీ, పంటల రుణాలు తదితర అన్ని సేవలను అందిస్తారని వివరించారు. అనంతరం వత్సవాయిలో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల వ్యవసాయ, జగ్గయ్యపేట డివిజన్ హార్టీకల్చర్ అధికారులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో వరద ఉధృతి పరిశీలన

చందర్లపాడు(నందిగామటౌన్): కృష్ణానదిలో వరద ఉధృతి అధికంగా ఉన్నందున పడవ ప్రయాణాలు చేయకుండా రెవెన్యూ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో రవీంద్రరావు ఆదేశించారు. చందర్లపాడు మండలంలోని కాసరబాద గ్రామంలో కృష్ణానదిలో వరద ఉధృతిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నదీ పరివాహక గ్రామాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. ముఖ్యంగా నదిలో రాకపోకలు సాగించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతే కాకుండా వరద కారణంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రెవెన్యూ సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ పాల్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నిలకడగా వరద ప్రవాహం

జగ్గయ్యపేట: మండలంలోని ముక్త్యాల గ్రామ సమీపంలోని పులిచింతల ప్రాజెక్టు నుంచి నాలుగు రోజులుగా కృష్ణానదికి వస్తున్న వరద శుక్రవారం నిలకడగా సాగింది. ప్రాజెక్టు నుంచి 11 గేట్ల ద్వారా 2.42 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయగా, నదీ పరివాహక ప్రాంతాలైన ముక్త్యాల, వేదాద్రి, రావిరాల గ్రామాల వద్ద కృష్ణానది ప్రవాహం ప్రస్తుతం నిలకడగా సాగుతోంది. ముక్త్యాలలోని కృష్ణానది ఒడ్డున్న భవానీ ముక్తేశ్వరస్వామి వారి ఆలయం నాలుగురోజులుగా నీటమునిగే ఉంది. వరద ఉధృతికి ఇబ్బందిపడకుండా పరివాహక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.



కాసరబాద వద్ద కృష్ణానది వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఆర్డీవో



ముక్త్యాల వద్ద కృష్ణానది ప్రవాహం

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

ఎంపీడీవో దీప్తి

కంచికచర్ల : ఇటీవల కుండపోతగా కురిసిన వర్షాల వల్ల సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ అత్తోట దీప్తి తెలిపారు. మండలంలోని గండేపల్లి, కీసర, కంచికచర్ల, కొత్తపేట, కునికెనపాడు, చెవిటికల్లు తదితర గ్రామాల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డేగా నిర్వహించి గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎప్పటికప్పుడు చెత్తను నిల్వ ఉంచకుండా డంపింగ్ యార్డుకు తరలించాలని ప్రజలకు సూచించారు. రోడ్ల వెంబడి బ్లీచింగ్ సున్నం చల్లించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఎబేట్‌ను పిచకారి చేయించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. సర్పంచులు ప్రత్తిపాటి సునీత, వేల్పుల సునీత, బి.రవికుమార్, బుడ్డి విజయలక్ష్మి, బండారుపల్లి సత్యనారాయణ, కార్యదర్శులు కనగాల రవికుమార్, జె.రత్నాకర్, వీ బ్రహ్మం, వెల్లంకి రామారావు, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గండేపల్లిలో డ్రైయినేజీలో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్న, కార్యదర్శి రత్నాకర్, ఆరోగ్య సిబ్బంది

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

నందిగామ టౌన్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని ఇన్‌చార్జి ఎంపీపీ ఆకుల హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న మూడురోజుల శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కార్యదర్శులు కృషి చేయాలని సూచించారు. ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ అనంతరం గ్రామపంచాయతీలలో చేయాల్సిన పాలన, పనులు, పంచాయతీ తీర్మానాలకు సంబంధించిన విధివిధానాలను, వీధిలైట్ల నిర్వహణ, తాగునీరు, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనుల ప్రణాళిక తదితర అంశాలను వివరించారు. ఈవోపీఆర్డీ పద్మజ్యోతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

జుజ్జూరు(వీరులపాడు): గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి సూచించారు. మండలంలోని జుజ్జూరు ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను శుక్రవారం ఆమె ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యదర్శులు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృపథంలో నడిపించాలన్నారు. అనంతరం పారిశుద్ధ్యం, వీధిలైట్ల నిర్వహణ, గ్రామాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, తీర్మానాలకు సంబంధించిన ఆయాఅంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో శివపార్వతీ, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వనాథ్, పక్కన ఎంపీపీ హనుమంతరావు, ఈవోపీఆర్డీ పద్మజ్యోతి

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

నందిగామటౌన్: నందిగామ పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆలయాల్లో శ్రావణ మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా మొదటి శ్రావణ శుక్రవారం ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. పట్టణంలోని శుకశ్యామలాంబ అమ్మవారు, మరిడీ మహాలక్ష్మి, వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు.మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న కనక మహాలక్ష్మి, , కనకదుర్గ, జ్ఞాన సరస్వతి అమ్మవార్లతోపాటు మండలంలోని ఆయా ఆలయాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. సామూహిక కుంకుమార్చనలు, అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు చేశారు.



నందిగామలో వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

బుద్ధదేవ్ భట్టాచార్యకు ఘననివాళి

జగ్గయ్యపేట: పశ్చిమబెంగాల్ అభివృద్ధికి మాజీముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య ఎనలేని సేవలందించారని జగ్గయ్యపేట సీపీఎం నాయకులు కొనియాడారు. స్థానిక డీవీఆర్ నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బుద్ధదేవ్ భట్టాచార్య మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమనేతగా, పశ్చిమబెంగాల్ సీఎంగా ఆయన ఎనలేని సేవలందించారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. భట్టాచార్యకు నివాళులర్పించిన వారిలో ఐద్వా డివిజన్ కార్యదర్శి సోమోజు నాగమణి, నాయకులు రవికుమార్, గౌస్‌మియా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భట్టాచార్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు